క్లుప్తంగా

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

ఆమదాలవలస రూరల్: మండలంలో కట్యాచార్యులపేట గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్‌ను సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లోనే ఆధార్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి సత్యనారాయణ, డిజిటల్ అసిస్టెంట్ సి.హెచ్.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

సారవకోట: సంక్రాంతి సెలవులకు ముందు విద్యార్థులకు నిర్వహించిన ఎస్‌ఏ-1 పరీక్షల్లో వచ్చిన మార్కుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఎంఈఓ ఎం.వి.రమణ సూచించారు. మండలంలోని శివరాంపురం, అంగూరు ప్రాథమిక పాఠశాలలను సోమవారం సందర్శించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. టీఏఆర్ఎల్ కార్యక్రమానికి సంబంధించిన తరగతులు ఏ విధంగా నిర్వహిస్తున్నారో పరిశీలించి పలు సలహాలు, సూచనలిచ్చారు.

పీఏసీఎస్ రుణాలు రెన్యువల్ చేసుకోవాలి



కొల్ల కృష్ణ

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం) ద్వారా ఖరీఫ్, రబీ 2022-23 పంట కాలానికి తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 20వ తేదీలోగా రుణాలు రెన్యువల్ చేసుకున్నావారు 4 శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుందన్నారు. సకాలంలో చెల్లించకపోతే వడ్డీ రాయితీని కోల్పోవాల్సి ఉంటుందన్నారు. గడువు దాటితే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే వడ్డీ రాయితీలు, ఇతర సౌకర్యాలను పొందలేరన్నారు. తమ సిబ్బంది ద్వారా, నేరుగా కార్యాలయానికి వచ్చి రుణాలు రెన్యువల్ చేసుకోవచ్చన్నారు.

సారవకోట ఎస్ఐగా అప్పారావు



సారవకోట: సారవకోట పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి.అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.లావణ్య బదిలీపై వీఆర్‌కు వెళ్లారు. సెబీలో పనిచేస్తున్న అప్పారావును సారవకోట ఎస్ఐగా నియమించారు. ఈయనకు స్థానిక సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

గృహసారథుల ఎంపికలు పూర్తిచేయాలి



బొరిగివలసలో గృహసారథుల జాబితాను సేకరిస్తున్న నర్సింగరావు

నరసన్నపేట: సచివాలయాల్లో పార్టీ పటిష్టతకు గృహసారథుల ఎంపిక తర్వాతిగతిన పూర్తిచేయాలని, జాబితాలను వెంటనే అందివ్వాలని సచివాలయ మండల కన్వీనర్ సురంగి నర్సింగరావు అన్నారు. సోమవారం ఉర్లాం, బొరిగివలస, అంబోజీపేట పంచాయతీల్లో గృహ సారథుల జాబితాను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామ వలంటీర్ పరిధిలో ఇద్దరు చొప్పున గృహ సారథులు ఉండాలని, వీరిలో ఒక మహిళ, ఒక పురుషుడు ఉండాలన్నారు. ఈనెల 30వ తేదీ కల్లా మండలంలో మొత్తం గృహ సారథుల జాబితా పార్టీకి పంపాలని, సర్పంచ్‌లు, పార్టీ సీనియర్ నాయకులు దృష్టి సారించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. సోమవారం నాలుగు పంచాయతీల నుంచి గృహ సారథుల జాబితా సేకరించడం జరిగిందని నర్సింగరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బాది ఈశ్వరరావు ఉన్నారు.

గౌరవ వేతనం పెంచాలని వినతి

ఆమదాలవలస: గ్రామ సర్పంచ్‌ల గౌరవవేతనం పెంచేందుకు కృషిచేయాలని పొందూరు మండల సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు, కేశవదాసుపురం సర్పంచ్ మొకర శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. స్పీకర్ క్యాంపు కార్యాలయం వద్ద స్పీకర్ తమ్మినేని సీతారామ్‌ను పలువురు సర్పంచ్‌లతో కలిసి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. సర్పంచ్‌లకు సామాజిక హోదా, గ్రామాల్లో గుర్తింపు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్పంచ్‌లు కొంచాడ గిరి, కిల్లాన రమణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఆమదాలవలస రూరల్: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

ఆమదాలవలస రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. చీమలవలస గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఉత్సాహంతో పాల్గొని తమకు అందుతున్న పథకాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. చీమలవలస నుంచి కట్యాచార్యులపేట గ్రామం వరకు అనుసంధానంగా సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు స్పీకర్‌ను కోరారు. దీనిపై స్పందించిన స్పీకర్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం పంట పొలాలను అందజేసిన రైతులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వల్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి వీలుకలుగుతుందన్నారు. దేశం మొత్తం గర్వించే విధంగా సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తున్నామన్నారు. పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టారని వెల్లడించారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం ఇప్పటికే అమలు చేశామన్నారు. గత టీడీపీ పాలనలో పథకాలు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, అర్హత ఉంటే పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు. మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ తిర్లంగి రామారావు, ఎంపీటీసీ కూటికుప్పల సన్యాసిరావు, ఎంపీడీఓ ఎం.రేణుక, ఏఓ మెట్ట మోహనరావు, ఎలక్ట్రికల్ ఏఈ బి.రవికుమార్, సర్పంచ్‌లు ఎన్ని రామచంద్రరావు, చిలకపల్లి సురేష్, సైలాడ దాసునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురుగుబెల్లి వెంకటప్పలనాయుడు, బొడ్డేపల్లి నిరంజన్, గురుగుబెల్లి చంద్రయ్య, గురుగుబెల్లి చలపతిరావు, గురుగుబెల్లి సీలారావు, పొన్నాడ రాము, మొండేటి కూర్మారావు, మానుకొండ వెంకమటరమణ, బమ్మిడి అచ్యుతరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడపగడపలో సంతోషం..

పాతపట్నం: సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బూరగాం గ్రామ సచివాలయ పరిధిలోని సీతారాంపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. ఇంటి వద్దకే పథకాల లబ్ధి అందుతున్నట్లు ప్రజలు ఆనందంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారం కోసం పథకాలు ప్రవేశపెట్టి, వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కిందని విమర్శించారు. జగనన్న ఇచ్చిన మాట కోసం ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కొని నవరత్నాలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. జగనన్న కాలనీ ఇళ్ల మంజూరు చేయాలని మహిళలు, గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. రెండో విడతలో ఇళ్ల మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఏపీఎం మనోరత్నం, ఈటీఆర్డీ ప్రసాద్ పండా, ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గేదెల సూర్యం, ధర్మాన కుమార్‌రెడ్డి, అప్పల రెడ్డి, సత్య బిశ్వాల్, మురళీ అప్టో, రామారావు, గేదెల బాలకృష్ణ, పనుకు మోహన్, కె.లక్ష్మీనారాయణ, దొర పార్వతీశం, పడాల రంజిత్, డైరెక్టర్ వెంకటరమణ, సాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతపట్నం: మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

- టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



వినతులు స్వీకరిస్తున్న టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: ప్రజల అందజేసిన ఫిర్యాదులు, అర్జీలు పరిష్కరించే దిశగా డివిజన్, మండల స్థాయి అధికారులు పనిచేయాలని టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని నేలబొంతు గ్రామంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రహదారులు, తాగునీరు, పెన్షన్లు, పోడు పట్టాలు తదితర సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రతీ ఇంటింటికీ వెళుతూ సమస్యలను తెలుసుకుంటున్నారని, అధికారులు సైతం అదేబాటలో ఆలోచనచేసి వినతులు స్వీకరించి, శాఖలవారీగా వాటికి తగిన పరిష్కారం చూపాలన్నారు. ప్రజలవద్దకు అధికారులు వెళ్లడం ద్వారా వారికి సహకరించినవారవుతామన్నారు. ప్రతీ సోమవారం గిరిజన గ్రామాల్లోనే స్పందన న్విహిస్తూ ప్రజలకు దగ్గరగా వెళ్లి వారి సమస్యలపై వినతులు స్వీకరిస్తామని తెలియజేశారు. నిర్ణీత కాల వ్యవధిలో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. డివిజన్ కేంద్రానికి ప్రజలు రాలేక వారి సమస్యలను చెప్పుకోలేని సమయంలో.. అధికారులే వారికి అందుబాటులో ఇటువంటి వేదికలను ఏర్పాటు చేసి ప్రతీ సమస్యపై అర్జీలు స్వీకరించాలనేది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. డీఎల్‌డీఓ అలివేలు మంగమ్మ, ఏడీ మధుబాబు, సీఐ వినోద్‌బాబు, డీఎంహెచ్ఓ లక్ష్మీ తులసి, తహసీల్దార్ పి.సరోజిని, ఎంపీడీఓ చంద్రకుమారి, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ పొడిగింపుపై హర్షం



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ విభాగం ప్రతినిధులు

నరసన్నపేట: రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు మరో పదేళ్ల ప్రయోజనం కల్పించేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పొడిగిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్డినెన్స్ తీసుకురావడం పట్ల ఎస్సీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎస్సీల అభివృద్ధికి మరో పదేళ్లు నిధులు రానున్నాయన్నారు. ఈ నిర్ణయం ఎస్సీ, ఎస్టీలకు వరమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి శ్రీను, నరసన్నపేట నియోకవర్గం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ సతివాడ రామినాయుడు, పోలాకి, నరసన్నపేట మండలాల ఎస్సీ సెల్ కన్వీనర్లు లక్ష్మణరావు, మచ్చ గణేష్ అన్నారు. ముఖ్యమంత్రికి ఎస్సీ, ఎస్టీలు రుణ పడి ఉంటారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీలు అన్ని విధాలా అభివృద్ధికి నోచుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం మా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎస్సీలు, ఎస్టీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. సీఎం జగన్‌కు తామంతా అండగా ఉంటామన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు మీసాల రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్ అన్నారు. సోమవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ అందేలా వలంటీర్లు చూస్తున్నారన్నారు. సేవే పరమావధిగా పనిచేస్తున్న వలంటీర్లపై టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. వలంటీర్లు గౌరవ వేతనం తీసుకుంటూ ప్రభుత్వం తరపున సేవలందిస్తున్నరన్న విషయాన్ని గుర్తించాలన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల అవినీతికి పాల్పడిన విషయం అందరికీ తెలుసన్నారు. నిస్వార్థ సేవకులైన గ్రామ వలంటీర్లుపై దుష్ప్రచారాలు మానుకోవాలన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల పనితీరు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వి.చిన్నారావు, ఎం.రామారావు, యందవ ప్రసాద్, టి.మురళీధర్, టి.తవుడు, మీసాల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


సుభాష్ చంద్రబోస్ ఆదర్శనీయుడు



నేతాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టెస్ సభ్యులు

ఎల్.ఎన్.పేట: సుభాష్ చంద్రబోస్‌ను నేటి తరం విద్యార్థులు ఆదర్శనీయంగా తీసుకోవాలని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) అధ్యక్ష, కార్యదర్శులు పెద్దకోట వెంకటరావు, డి.సుజాత, లయన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యుడు ఎం.కె.మిశ్రోలు అన్నారు. సోమవారం శ్రీనివాసనగర్‌లోని టెస్ సంస్థ కార్యాలయంలోనూ, లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోనూ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలను వేశారు. నేతాజీ సాహసం, తెగింపు, పోరాట స్ఫూర్తి గురించి విద్యార్థులకు వివరించారు. ఎ.శేఖర్, సంతోష్‌కుమార్, ఆర్.వాణిశ్రీ, రమణమ్మ, తవుడు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసారావు

పొందూరు: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వినియోగానికి యువత దూరంగా ఉండాలని పొందూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ పి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం ఎస్ఈబీ ఏఎస్పీ వీఎస్ మణికంఠ, అసిస్టెంట్ కమిషనర్ కేవీ గోపాల్ ఆదేశాల మేరకు సోమవారం పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. సరదాల కోసం మాదక ద్రవ్యాలకు దగ్గర కాకూడదని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు, ఎస్ఈబీ ఎస్ఐ మురళీక్రిష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



సారవకోట:ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది




కొత్తూరు: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

సారవకోట: మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ శరీరంలో ఏ భాగానికైనా సోకవచ్చునని వైద్యులు దేవిక, సౌమ్యా సూచించారు. ఈ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి సోకకుండా ఉండాలంటే శరీరానికి కావాల్సిన అన్ని రకాల విటమిన్లు, పోషక పదార్థాలు తీసుకోవాలన్నారు. మద్యం, పొగతాగడం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తూరు: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కురిగాం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. క్యాన్సర్ వ్యాధిపై వైద్య సిబ్బందితో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. శ్రీలత మాట్లాడుతూ అధికంగా పొగ తాగడం, మద్యం సేవించడం వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. స్త్రీలలో ఎక్కువ మందికి రొమ్ము క్యాన్సర్ వస్తుందన్నారు. ప్రశాంతంగా ఉంటే క్యాన్సర్ రాదన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఈఓలు బుజ్జిబాబు, విమలారావు, విలేజ్ క్లినిక్ స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

- డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు

పోలాకి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు క్రియాశీలంగా పనిచేయాలని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం పోలాకిలో ఏర్పాటు చేసిన సచివాలయ కన్వీనర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసే బాధ్యత మనమందరం తీసుకోవాలన్నారు. గృహసారథుల ఎంపిక బాధ్యతతో చేపట్టాలని సూచించారు. మండల సచివాలయాల కన్వీనర్‌గా ఎన్నికైన కణితి సత్తిబాబును మండల పార్టీ తరఫున అభినందించారు.

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచనలతో 23 సచివాలయాల పరిధిలో గృహసారథుల నియామక కమిటీని ఏర్పాటు చేసి వారి నియామకం వేగవంతం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ సత్తిబాబు, యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, మాజీ ఎంపీటీసీ చింతాడ ఉమామహేశ్వరరావు ఉన్నారు. రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య, వైస్ ఎంపీపీ కలగదండు తాతారావు, కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



తెలికిపెంటలో సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిస్తోందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తెలికిపెంట పంచాయతీలో గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలను సోమవారం ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ అందించనున్న తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లడతూ గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పాలన, సచివాలయం భవనాల వైపు దేశం మొత్తం చూస్తూ వాటి అమలుకు అధ్యయన కమిటీలు వేయడం గొప్పవిషయమన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపన దిశగా ప్రభుత్వం చేపడుతున్న భవనాలు, నిర్మాణాలతో పరిపాలన ప్రజలకు చేరువ అవుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేవరకు సరకు నిల్వలకు పెద్ద ఎత్తున గోదాములు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో చదువుకున్న ప్రతీ విద్యార్థి మొదటి స్థానంలో ఉండాలన్న తపనతో విద్యారంగానికి అగ్రపీఠం వేస్తున్నామని తెలిపారు. వైద్యం కోసం కిలో మీటర్లు దూరం వెళ్లకుండా గ్రామ స్థాయిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. పేదరికం అనేది విద్య, వైద్యం, సేద్యానికి అడ్డుకాకూడదనే ఆలోచనతో అహర్నిశలు శ్రమిస్తున్న సీఎంకు ప్రజలంతా సహకరించాలని కోరారు. రైతులకు ఉచిత బీమా, రైతు భరోసా, వడ్డీ రాయితీ అందించి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే అగ్రికల్చర్, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేశామని తెలిపారు. పెద్దపేట హార్టికల్చర్ పరిశోధనా కేంద్రం పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ బెవర కృష్ణవేణి, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీలు జీవీ శివానందమూర్తి, లావేటి అనిల్‌కుమార్, బూత్ కమిటీ కన్వీనర్ మూడడ్ల రమణ, చెంచల ముఖలింగం, ఎంపీడీఓ మురళీమోహన్‌కుమార్, తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు




ఉత్సవ విగ్రహాలను చక్రతీర్థ స్నానాలకు తీసుకెళ్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని తొగిరి అభయాంజనేయ స్వామి వారి చక్రతీర్థ స్నానాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఆలయ వార్షికోత్సవం అనంతరం నాల్గో రోజు స్వామి వారి చక్రతీర్థ స్నానాలను స్థానిక కోనేరులో చేపట్టారు. ఆలయంలో విశేష, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలో స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామదాసుపురంలో, ఇల్లయ్యగారిపేటలో రహదారుల శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

రెడ్‌క్రాస్ విభాగం ఏర్పాటు



మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రెడ్‌క్రాస్ విభాగం

పోలాకి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (శ్రీకాకుళం జిల్లా శాఖ) ఆధ్వర్యంలో ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో రెడ్‌క్రాస్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ పి.ప్రవీణ సోమవారం తెలిపారు. ఈ విభాగాం ద్వారా విద్యార్థులకు సమాజసేవలో భాగస్వామ్యం చేసి రక్తదానం, నేత్రదానం, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చైతన్యపరిచే కార్యక్రమంలో వీరు చురుగ్గా పాల్గొంటారని చెప్పారు. రెడ్‌క్రాస్ విభాగం ఏర్పాటు కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, పీడీ నీలం ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు

పోలాకి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బర్ల రాంబాబు కుటుంబానికి టెక్కలి అభయం యువజన సేవా సంఘం, వకుళాభరణం ఈశ్వరరావు అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ తరపున రూ.15వేలు ఆర్థికసాయం చేశారు. కింజరాపుపేటలోని మృతుడి ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

హెచ్‌ఎం పేరుతో రూ.15 వేల టోకరా

కొత్తూరు: మండలంలోని జోగిపాడులో హెచ్‌ఎం పేరు చెప్పి అదే గ్రామానికి చెందిన కరణం రమణ వద్ద నుంచి రూ.15వేలను గుర్తుతెలియని వ్యక్తి టోకరా వేశాడు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మోటారు సైకిల్‌పై జోగిపాడు వచ్చాడు. హెచ్‌ఎం డబ్బులు ఇమ్మని తనను పంపించారని రమణను అడిగాడు. రమణ ఆ మొత్తం ఇవ్వడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం ఎన్.ప్రసాద్‌తో మాట్లాడిన రమణ అసలు విషయం తెలుసుకుని లబోదిబో అన్నాడు. డబ్బులు ఇచ్చిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఫొటోను రమణ తీశారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

86 మంది కంటి పరీక్షలు

కొత్తూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. కొత్తూరు మాజీ సర్పంచ్, ఆలయం కమిటీ ప్రధాన కార్యదర్శి లోతుగెడ్డ తాతబాబు శిబిరాన్ని ప్రారంభించారు. కొత్తూరు, భామిని మండలాలతోపాటు ఒడిశాకు చెందిన 86 మందికి కొత్తూరు ఆఫ్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు చేశారు. 25 మందిని శస్త్ర చికిత్సల కోసం గుర్తించారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

పాతపట్నం: వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను మంగళవారం ఉదయం పది గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ జిరాక్స్‌తోపాటు రూ.1000 ముందస్తుగా చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

పాతపట్నం: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో చదవాలని వ్యాపారవేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని పెద్దలోడిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం క్రీడా దుస్తులను తేజేశ్వరరావు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రాజగోపాల్, ఎస్ఎంసీ చైర్మన్ ప్రభావతి, పీడీ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్వారీల పరిశీలన

బూర్జ: మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లిపల్లి గ్రామం సమీపంలో ఉన్న చింతల కొండ, లక్ష్మీపురం కొండలను (క్వారీలను) పోలీస్, రెవెన్యూ సిబ్బంది సోమవారం పరిశీలించారు. గ్రామస్తులు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్టోన్ క్రషర్ నిమిత్తం రాళ్ల నిత్యం వాహనాలతో తరలిస్తున్నారని, రాళ్ల రిగ్గుతో డ్రిల్లింగ్ చేయడంతో గ్రామంలోకి వచ్చి పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ బి.అశోక్‌బాబు, డీటీ సంతోష్ కుమార్, ఆర్ఐ, వీఆర్వో పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

పాతపట్నం: రోగులకు వైద్య సేవలు అందించడంలో అలక్ష్యం ప్రదర్శించవద్దని స్థానిక సీహెచ్‌సీ సిబ్బందికి డీప్యూటీ డీఎంహెచ్‌వో సూచించారు. సీహెచ్‌సీని సోమవారం తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలతోపాటు, ఆస్పత్రిలో సౌకర్యాలు, మందుల నిల్వలు, వైద్య సిబ్బంది హాజరు పరిశీలించారు. సూపరింటెండెంట్ వై.సురేంద్రబాబుకు, వైద్యులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోవాలి

కొత్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఫ్యామిలీ డాక్టర్ ఫరుక్ హసన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.వైకుంఠరావు కోరారు. గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం ఏర్పాటు చేసి 42 మందికి వైద్య సేవలను వైద్యులు ఫరుక్ హసన్, సాయిగీత అందించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, వైద్య, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.